

రైతులు ఈ-కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 18 : పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసి సూచించారు. ఆదివారం గుండాలలో ఈ-కేవైసీ అప్‌డేట్‌కు రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 92 శాతం అప్‌డేట్ ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగతా రైతులు విధిగా ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో స్వాతిప్రియ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక

ఆమనగల్లు ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డికి అవకాశం



ఆమనగల్లు, ఫిబ్రవరి 18: ఆమనగల్లు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు(ఎస్‌జీటీ) ఎం.శ్రీనివాస్‌రెడ్డి జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుండి 25 వరకు గుజరాత్ రాష్ట్రంలోని ఐఐటీ గాంధీనగర్‌లో క్రియేటివ్ లెర్నింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే అప్లికేషన్ ఓరియెంటెడ్, కాంటెక్స్ట్ డ్రైవెన్ లెర్నింగ్ శిక్షణకు శ్రీనివాస్‌రెడ్డిని ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీనివాస్‌రెడ్డి వెల్దండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా ఆయన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలలో భాగంగా జిల్లా, రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైన శ్రీనివాస్‌రెడ్డిని నాగర్‌కర్నూలు డీఈవో గోవిందరాజు, ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రవికిరణ్, ప్రధానోపాధ్యాయుడు జైపాల్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

రేపటి నుంచి కడ్తాలలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

- ఏడు రోజుల పాటు నిర్వహణ
- భక్తులకు వసతుల ఏర్పాటు



కడ్తాల్ , ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. రేపటి నుంచి 26 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. కడ్తాలతో పాటు తలకొండపల్లి, కందుకూరు, ఆమనగల్లు, కేశంపేట, యాచారం, ఇబ్రహీం పట్నం, మహేశ్వరం ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాల వివరాలను కమిటీ చైర్మన్ టి. వేణుగోపాల్, ఈవో మోహన్‌రావు ఆదివారం వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20వ తేదీన స్వస్థి పుణ్యహవాచనం, విశ్వకసేన పూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, అంకురార్పణ కార్యక్రమాలు ఉంటాయి. 21వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామ పారాయణం, రాత్రికి స్వామివారి ఎదుర్కోళ్లు, 22న స్వామి వారి కల్యాణోత్సవం, తెల్లవారుజామున అగ్నిగుండాలు, 23వ తేదీన పుష్పమాల సేవ, చిన్నతేరు, విష్ణుసహస్ర నామ పారాయణం, 24వ తేదీన కుంకుమార్చన, పెద్దతేరు, 25వ తేదీన దీపోత్సవం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తారు. 26వ తేదీన చక్రతీర్థం, గరుడసేవ, కుంకుమార్చన, స్వామివారి ఊరేగింపు, నాగవల్లి కార్యక్రమాలు ఉంటాయని వారు వివరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అర్చకులు తిరునగరి వెంకటేశ్, తిరునగరి శ్రీధర్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ పిలుపునిచ్చారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం



శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం. భక్తులకు విశాలమైన ఆలయ ఆవరణలో వసతులు కల్పిస్తున్నాం. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి.

- టి.వేణుగోపాల్, ఉత్సవ కమిటీ చైర్మన్

స్త్రీనిధి ఏది?

లక్ష్యం కొండంత.. ఇచ్చింది గోరంత





- రుణాల మంజూరు అంతంతే
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న మహిళలు
- అధికారుల అలసత్వంతో నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

నిరుపేద మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు స్వయం సహాయక సంఘాలకు ఇస్తున్న స్త్రీనిధి రుణాలు అందని ద్రాక్షలా మారాయి. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా నెలలు గడుస్తున్నా అందడం లేదు. దీంతో మహిళలు పెట్టుబడికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వడ్డీ వ్యాపారులు మహిళల వద్ద నుంచి అధిక వడ్డీని వసూలు చేస్తున్నారు. వ్యవసాయం, చిన్నపాటి వ్యాపారాల్లో వచ్చే కొద్దిపాటి మొత్తం వడ్డీల చెల్లింపులకే సరిపోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్త్రీనిధి పథకం కింద తమకు ఆర్థిక సాయం అందిస్తుందని ఆశిస్తే తమ ఆశలు తీరేలా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18: గ్రామీణ నిరుపేద మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక పరిపుష్టి సాధించే ఉద్దేశంతో అందిస్తున్న స్త్రీనిధి రుణాలు అందని ద్రాక్షలా మారాయి. ఆర్థిక అవసరాల కోసం మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా నేటికి స్త్రీనిధి రుణాలు వారి దరి చేరడం లేదు. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా వారాలు, నెలలు గడిచినా మహిళలకు రుణాలు అందటం లేదు. జిల్లాలో జిల్లా మహిళా సమాఖ్య ఉండగా, 21 మండల సమాఖ్యలున్నాయి. 788 గ్రామ మహిళా (వీవో) సంఘాలున్నాయి. 19,202 స్వయం సహాయ సంఘాలు ఉండగా వాటిలో 2,06,475 మంది సభ్యులున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి పథకం కింద రూ.10,287.26 లక్షలు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.1,479.63 లక్షలు మాత్రమే పంపిణీ చేశారు. సాధించిన ప్రగతి రూ.14.38 శాతంగా నమోదైంది. స్త్రీనిధి రుణాలు సకాలంలో అందక మహిళలు అవస్థలు పడుతోన్నారు. ప్రస్తుతం మహిళలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరం

స్త్రీ నిధి లక్ష్యం (రూ.లక్షలు)	పంపిణీ చేసింది (రూ.లక్షలు)	సాధించిన ప్రగతి (శాతం)
10,287.26	1,479.63	14.38

కిస్తీ కట్టకుంటే.. ఇక అంతే?

స్త్రీనిధి బ్యాంకు నిబంధనల ప్రకారం ఒక్కో సంఘంలో గరిష్టంగా ఎనిమిది మంది సభ్యులకు దశల వారీగా రుణాలు ఇవ్వవచ్చు. సంఘం అకౌంట్ జనరల్ రుణంగా రూ.25 వేలు, మైక్రో రుణంగా రూ.50 వేలు, ట్రైనీ రుణంగా రూ.లక్షకు పైగా వ్యక్తిగతంగా తీసుకోవచ్చు. ప్రతి నెలా నిర్ధేశిత వ్యవధిలో రుణానికి సంబంధించిన కిస్తీ గ్రామ సమాఖ్య సంఘానికి చెల్లిస్తే. అధ్యక్షురాలితో పాటు గ్రామ సమాఖ్య సంఘం సహాయకురాలు ఈ మొత్తాన్ని స్త్రీనిధి బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. సాధారణంగా రుణంపై 12.5 శాతం వడ్డీ వసూలు చేస్తుంటారు. నిర్ధేశిత వ్యవధిలో చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో వడ్డీ రాయితీ ఇస్తుంది. వారు వడ్డీ రూపంలో చెల్లించిన మొత్తాన్ని తిరిగి వారి ఖాతాలో జమ చేస్తుంది. సంఘాల్లో రుణం తీసుకున్న వారిలో ఏ ఒక్కరు నెల పాటు కిస్తీ కట్టకపోయినా ఆ సంఘాల్లో కొత్తగా రుణాలు పొందే అవకాశం ఉండదు. మహిళా సంఘాల ప్రతినిధులు వరుసగా కిస్తీని చెల్లించినప్పటికీ దాన్ని స్త్రీనిధి బ్యాంకులో జమ చేయకూడదనే సంకేతాలు అంతర్గతంగా ఇచ్చినట్లు సమాచారం. వరుసగా మూడు నెలల పాటు కిస్తీ డబ్బు చెల్లించకుంటే ఎన్‌పీఏ (నాన్ ఫెర్ఫార్మింగ్ ఖాతాల్లోకి) మహిళలు చేరిపోతారు. ఈ దశలో వారికి మూడు నెలలకు సబంధించి వడ్డీ రాయితీ ప్రభుత్వం విడుదల చేయదు. దీంతో మహిళా సంఘాల సభ్యులు వడ్డీని నష్టపోవాల్సి వస్తుంది.

వాయిదాలు చెల్లించినా పత్తాలేని రాయితీ?

మహిళలు రూ. లక్షల్లో రుణాలు పొందుతున్నారు. కుటుంబ అవసరాల కోసం తీసుకున్న బ్యాంకు రుణాలను వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లిస్తున్నారు. వ్యవసాయంలో పరిస్థితులు అనుకూలించకపోయినా.. కూలి పనులకు వెళుతూ తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేందుకు శ్రమిస్తున్నారు. నిర్ణీత గడువులోపు రుణాలకు సబంధించి వడ్డీ, అసలు కలిపి చెల్లిస్తున్నారు. అయినా, జిల్లాలో చాలామందికి రాయితీలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

దరఖాస్తు చేసుకుని రెండు నెలలవుతుంది



స్త్రీనిధి రుణం కోసం దరఖాస్తు చేసుకుని రెండు నెలలు అవుతుంది. దరఖాస్తు చేసుకున్నాక 48 గంటల్లో ఇవ్వాల్సిన రుణాల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మా సంఘంలో ఐదుగురం సభ్యులమున్నాము. ఇప్పటి వరకు రుణాలు ఎవరికీ మంజూరు కాలేదు. రుణం త్వరగా మంజూరు చేయాలి.

- అన్నపూర్ణ, మహాలింగపురం, శంకర్‌పల్లి మండలం

రుణాలు సకాలంలో అందడం లేదు



సకాలంలో శ్రీనిధి రుణాలు అందుత లేవు. దరఖాస్తు చేసుకుని నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. మొదట్లో త్వరగా ఇచ్చేవారు. రాను రాను నిధుల మంజూరులో ఆలస్యం ఏర్పడుతుంది. రుణాలు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నారు. తిరిగి చెల్లించే విషయంలో ఒత్తిడి చేస్తారు. వసూళ్లలో తీసుకుంటున్న శ్రద్ధ మంజూరులో కూడా తీసుకోవాలి. ప్రభుత్వం మారినా.. అధికారుల తీరు మారడం లేదు.

- సౌజన్య కవ్వగూడ, శంషాబాద్ మండలం



సీఎంను కలిసి..

తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ రాజయ్య, సభ్యుడిగా తాండూరుకు చెందిన ఎం.రమేష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఫైనాన్స్ కమిషన్ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించిన రాజయ్య, రమేష్‌లకు అభినందనలు తెలిపారు.

- తాండూరు, ఫిబ్రవరి 18

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పరామర్శ

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదివారం కలిశారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులతో కలిసి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, పలువురు పార్టీ నాయకులున్నారు. - చేవెళ్ల, ఫిబ్రవరి 18



పక్కాగా 'ఎరువుల ఎంట్రీ'

- ఆన్‌లైన్‌లో నిల్వల వివరాల నమోదుకు యాప్‌ను రూపొందించిన వ్యవసాయ శాఖ
- 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం'తో పూర్తి సమాచారం అందుబాటులోకి..

చేవెళ్ల, ఫిబ్రవరి 18 : ఎరువుల నిల్వల లెక్కలు ఇకపై పక్కాగా చేపట్టనున్నారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతికతను వినియోగించి రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమేరకు 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం' ద్వారా ఎరువుల దుకాణాల్లో నిల్వల వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేస్తారు. అయితే, ఇదివరకు ఇలాంటి ప్రక్రియ అందుబాటులో లేకపోవడంతో ఎరువుల నిల్వల సమాచారం తెలిసేది కాదు. దీంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. గోడౌన్లలో ఉన్న నిల్వలకు దుకాణదారులు చెప్పే లెక్కలకు వ్యత్యాసం ఉంటున్నట్లు వ్యవసాయాధికారుల తనిఖీల్లో బయటపడింది. దాంతో వ్యవసాయ శాఖ సాంకేతికతను ఉపయోగించి కొత్త యాప్‌ను రూపొందించింది.



చేవెళ్లలో ఎరువుల నిల్వలను యాప్‌లో ఎంట్రీ చేస్తున్న వ్యవసాయాధికారులు

అనుమతి పొందిన షాపుల్లోనే నమోదు

డీఏపీ, యూరియా వంటి ఎరువులు అనుమతి పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారుల సూచన మేరకు విక్రయిస్తేనే ఎన్ని నిల్వలు ఉన్నాయో తెలుస్తుంది. ఈమేరకు అధికారులు ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేసి యాప్‌లో ఎంట్రీ చేస్తారు. చేవెళ్ల డివిజన్ పరిధిలో.. చేవెళ్ల మండలంలో 28 దుకాణాలు, శంకర్‌పల్లిలో 25, షాబాద్‌లో 27, మొయినాబాద్ మండలంలో 6 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి. వీటిలో కొన్ని దుకాణాల్లో ఎరువుల విక్రయం తగ్గినట్లయితే యాప్‌లో వివరాల నమోదుకు అవకాశం ఉండదని అధికారులు తెలిపారు. అదేవిధంగా ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు డీసీఎంఎస్, పీఏసీఎస్ గోడౌన్లలో ఉన్న ఎరువుల వివరాలూ యాప్‌లో నమోదు చేస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా, రైతులకు ఎరువులు ఏమేర నిల్వ ఉన్నాయి? అందుబాటులో లేనివి తెలియడానికే కొత్త యాప్‌ను రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

దుకాణాల్లో పక్కాగా తనిఖీలు

వ్యవసాయ శాఖ రూపొందించిన ఈ యాప్‌లో ఎరువుల వివరాలు పక్కాగా నమోదుచేసే ప్రక్రియను చేవెళ్ల డివిజన్ పరిధిలో అధికారులు రెండు వారాల క్రితమే ప్రారంభించారు. ఈమేరకు ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి సేల్ పాయింట్ల వద్ద ఎరువుల నిల్వల వివరాలు, ఫొటోలు తీసుకుంటున్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో యాప్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి నిక్షిప్తపరుస్తున్నారు. స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే ఫొటోలను కూడా ఫర్టిలైజర్ దుకాణం వద్దనే అప్‌లోడ్ చేస్తున్నారు. దాంతో స్టాక్, విక్రయాలు పకడ్బందీగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

యాప్ రూపకల్పన మంచి నిర్ణయం



రైతుల ప్రయోజనార్థం రూపొందించిన ఈ యాప్ ద్వారా సమాచారం తెలుసుకోవడం సులువుగా ఉంటుంది. ఫర్టిలైజర్ షాపుల్లో ఏయే ఎరువులు ఎంత మేర నిల్వలు ఉన్నాయో తెలుసుకోవచ్చు. స్టాక్ లేదని చెప్పి ఎక్కువ ధరకు విక్రయించకుండా అధికారుల పర్యవేక్షణ ఉంటుంది.

- గోపాల్‌రెడ్డి, రైతు, మల్కాపూర్

రైతుల ప్రయోజనానికే 'యాప్'



ఎరువుల నిల్వలు తెలుసుకోవడానికి వ్యవసాయ శాఖ కొత్తగా యాప్‌ను రూపొందించింది. అధికారులు ఎరువుల దుకాణాలకు వెళ్లి తనిఖీ చేసి వివరాలను యాప్‌లో ఎంట్రీ చేస్తారు. దాంతో నిల్వలు ఎంత మేర ఉన్నాయో తెలుసుకోవచ్చు. గ్రామీణ రైతులకు యాప్ ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తారు.

- తులసి, ఏవో, చేవెళ్ల

కాంగ్రెస్ హయాంలోనే సుస్థిర పాలన

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జంగారెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న లేమూరు గ్రామస్తులు

కందుకూరు, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డిలు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నేత ఢిల్లీ శ్రీధర్, లేమూరు గ్రామశాఖ అధ్యక్షుడు గుల్బి జంగయ్య ఆధ్వర్యంలో 80మంది కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేఎల్లార్, నర్సింహారెడ్డి, జంగారెడ్డిలు మాట్లాడుతూ 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలనూ అమలు చేయలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ప్రజాపాలన అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, ఎస్.కృష్ణానాయక్, కె.రాణాప్రతాప్‌రెడ్డి, సరికొండ మల్లేష్, గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, గూడూరు కొండారెడ్డి, అందుగుల సత్యనారాయణ, సరికొండ జగన్, సిద్ధేశ్వర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, బి.పాండురంగారెడ్డి, వి.బాబు, ఇంద్రారెడ్డి, బొక్క భూపాల్‌రెడ్డి, మంచాల భాస్కర్, బలవంత్‌రెడ్డి, మల్లయ్య, మీగడి శేఖర్, రాకేష్‌గౌడ్, యుగేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై అవగాహన

నవాబుపేట, ఫిబ్రవరి 18:ఎల్లకొండ, పులుమామిడి, నవాబుపేట సంతల్లో ఆదివారం బీజేపీ నాయకులు ప్రజలకు ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపైఅవగాహన కల్పించారు. జేకేఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చేవేళ్ల మాజీ ఎంపీ కె. విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో ప్రజలకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎస్.జగన్, దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు శివప్రభు, నర్సింహులు, నర్సింహాచారి, శ్రీధర్‌రావు, రామకృష్ణారెడ్డి, మణికంఠరెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా సాయి ముక్తి ధామం 19వ వార్షికోత్సవం

శామీర్‌పేట, ఫిబ్రవరి 18 : శామీర్‌పేటలోని సాయి ముక్తి ధామంలో 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు నరేంద్రబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం ప్రార్థన, కాకడ హారతి, మంగళ స్నానం, అభిషేకం, గోపూజ, ఆలయ ప్రదక్షిణం, గణపతిపూజ, రక్షాబంధనం, అఖండ దీపాస్థాపనం, నవగ్రహ ఆరాధనం, మహాన్యాస రుద్రాభిషేకం, అష్టోత్తర శతకళాభిషేకాది పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం చేపట్టారు. సాయంత్ర సహస్ర నామార్చన, గణపతి హోమం, గురు దేవత హోమం, ఆశీర్వచనం, సంధ్యా హారతి పూజలు చేశారు. రాత్రి సేజ హారతి జరిపారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున వచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు.



శ్రీసాయి ముక్తిధామం వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు



కాచవానిసింగారంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని కాచవానిసింగారంలో గల సర్వే నంబర్ 66లో గల ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాల ఆదివారం అధికారులు కూల్చి వేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహసీల్దార్ డీఎస్ రజిని హెచ్చరించారు. ఆర్ఐ సాయిరాం సిబ్బందితో వెళ్లి మూడు బేస్మెంట్లను, అలాగే ఓ ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ప్రజావసరాలకు కేటాయించినవని, వాటిని ఎవరు కబ్జా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

క్రీడా ప్రాంగణాన్ని పట్టించుకోరా?

బషీరాబాద్, ఫిబ్రవరి 18: మండలంలోని కాశీంపూర్ శివారులో రోడ్డు పక్కన గతంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దీని నిర్వహణను పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఈ ప్రాంగణం బోర్డు 6 నెలల కింద గాలిదూమరానికి కూలిపోయింది. గ్రామస్తులు తెలియజేయడంతో అప్పట్లో పంచాయతీ రాజ్ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు. మరి బోర్డును సరిచేయనే లేదు. బోర్డు కిందపడి జంగుపట్టి అక్షరాలు కన్పించకుండా పోతున్నాయి. పిల్లర్లు నేలమట్టం అయ్యాయి. దీన్ని చూస్తూ గ్రామస్తులు అధికారుల పనితీరుకు ఇదే నిదర్శనం అని ఎండగడుతున్నారు.



కాశీంపూర్‌లో పడిపోయిన క్రీడా ప్రాంగణం బోర్డు

ప్రత్యేకాధికారులకు మార్గదర్శకాలు

- పంచాయతీల్లో జాయింట్ చెక్ పవర్
- పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు
- రెండు నెలకోసారి గ్రామ సభ



గ్రామపంచాయతీ భవనం

తాండూరు, ఫిబ్రవరి 18 : గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, కార్యదర్శులకు జాయింట్‌గా చెక్ పవర్‌ను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ నెల 2 నుంచి గ్రామపంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన విషయమైన విషయం తెలిసింది. రికార్డులను పంచాయతీ కార్యదర్శి ఆధీనంలోనే ఉండేలా చూసుకోవాలని ఉత్తర్వుల్లో సూచించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఖచ్చితంగా రెండు నెలకోసారి గ్రామ సభను నిర్వహించాలని పేర్కొన్నారు. గృహనిర్మాణ అనుమతులు, లైసెన్సులు, ఆన్‌లైన్స్‌లను జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. జమ, ఖర్చు వివరాలు, పక్కాగా నిర్వహించాలని, లేకుంటే క్రమశిక్షన చర్యలుంటాయని హెచ్చరించారు. ఇంటి పన్నుల డిమాండ్ నోటిసులను వెంటనే జారీ చేయాలని, ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను టెండర్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. మంచినీటిసదుపాయం వీధిదీపాల నిర్వహణతోపాటు సీసీచార్జీలు కట్టాలని చెప్పారు. పారిశుధ్య పనులను ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో ఫ్రీ పబ్లిసిటీ

- పాలకమండలి ఆదాయానికి గండి
- అడ్డగోలుగా వెలుస్తున్న హోర్డింగ్‌లు



ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

తాండూరు, ఫిబ్రవరి 17 : పట్టణంలో అనధికార ఫ్రీ పబ్లిసిటీకి అడ్డూ, అదుపూ లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వెలుస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం నిద్రపోతోంది. మున్సిపాలిటీ అనుమతి లేకుండా పలువురు ఏర్పాటు చేసుకున్న బ్యానర్లు, హోర్డింగ్‌లు కనిపించినా వాటిని చూసీ చూడనట్లుగా వెళ్ళిపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఏ అనుమతి లేకుండా హోర్డింగులను ఏర్పాటు చేసిన వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదంటే టౌన్‌ప్లానింగ్ విభాగం ఉన్నట్లా? లేనట్లా? అని ఎద్దేవా చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలోనే తాండూరు మున్సిపాలిటీ పెద్దది. వ్యాపార కేంద్రం కావడంతో రోజూ వేలాది మంది వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పట్టణంలో పలు ప్రచారాల కోసం ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, పోస్టర్లను పెడుతున్నారు. వీటన్నింటినీ పలువురు అనుమతి లేకుండానే ఏర్పాటు చేస్తున్నారు. అది కూడ ఒక్కరోజో, రెండు రోజులో కాదు.. నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనల రుసుము చెల్లించకుండా దర్జాగా నెలల తరబడి ప్రచార బోర్డులు పెట్టుకుని వ్యాపార సంస్థలు ప్రచారం చేసుకుంటున్నాయి. పట్టణంలో ప్రధాన వ్యాపార కూడళ్ళు, రద్దీ ప్రాంతాలైన ఇందిరాచౌక్, బస్టాండు, విలియమూన్ చౌరస్తాలో యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు.

జరిమానాలు విధించేనా..

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హోర్డింగ్‌లపై మున్సిపాలిటీ జరిమానాలు విధించాలని, ఒక్కోరకమైన ప్రకటన కోసం నిబంధనల ప్రకారం రుసుము వసూలు చేయాని పలువురు చెబుతున్నారు. మున్సిపాలిటీ ఆదాయం సమకూరుతుందని అంటున్నారు. కాగా 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉండే అనధికార ప్రకనటకు రోజుకు రూ.లక్ష, 15 అడుగుల కంటే తక్కువ ఎత్తులో ఉంటే రోజుకు రూ.50 వేలు, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికేట్ లేకుండా ప్రకటనలు ఉంటే రోజు రూ.50వేలు జరిమానాలు విధించవచ్చని నిబంధనలున్నాయి.

భూకబ్జాదారులను శిక్షించాలి

- కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు కాకి ఈశ్వర్



మాట్లాడుతున్న ఈశ్వర్‌ముదిరాజ్

మహేశ్వరం, ఫిబ్రవరి 18 : తాను కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని కబ్జాచేసి, భూమిలోకి వస్తే చంపుతామని మహేశ్వరం గ్రామానికి చెందిన కాకి లక్ష్మయ్య అతని కుమారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ చెప్పారు. ఆదివారం మండల కేంద్రంలోగల బొడ్రాయివద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక, ఎదుర్కోలేక తమపై పలువురు భూకబ్జా ఆరోపణలు చూస్తూ, కిరాయి గూండాలతో తనను చంపడానికి ప్రయత్నిస్తున్నారన్నారని ఆరోపించారు. మహేశ్వరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 87లో తన తల్లికి 3 ఎకరాల 20 గుంటల భూమి ఉండడంతో, ఆమె ద్వారా తనకు, తన సోదరులయిన కాకి లక్ష్మయ్య, సత్యనారాయణ, కుమార్‌కు ఒక్కొక్కరికి 35 గుంటల భూమిని గిఫ్ట్ డీడ్ చేశారని చెప్పారు. తన సోదరుడు కాకి లక్ష్మయ్య తన వాటాకు వచ్చిన 35 గుంటల భూమిని 2012లో హైదరాబాదుకు చెందిన మేకల దామోదర్‌రెడ్డికి విక్రయించారని, 2022లో మేకల దామోదర్‌రెడ్డివద్ద నుంచి తాను ఆ భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని పట్టా, పాసుబుక్కు పొంది రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదు చేసుకున్నానని చెప్పారు. కానీ లక్ష్మయ్య ఆయన కుమారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబసభ్యులను బెదిరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతే కాకుండా తానే భూకబ్జాకు పాల్పడ్డానని అసత్యపు ప్రచారం చేయించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారిపై పరువునష్టం కేసు వేస్తానని చెప్పారు. తన భూమి కేసుకు కాంగ్రెస్ పార్టీకి ఏ సంబంధం లేదని, కావాలని పార్టీకి భూమి కేసును అంటగట్టి దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తాను ఎవరి భూమిని కబ్జా చేయలేదని ఈశ్వర్‌ముదిరాజ్ అన్నారు.

గీత కార్మికుడికి చెట్టుపై విద్యుత్ షాక్

- పట్టు కోల్పోయి వేలాడుతూ ఆర్త నాదాలు
- కాపాడిన స్థానికులు



తాటి చెట్టు పై వేలాడుతున్న వీరయ్య

కీసర రూరల్, ఫిబ్రవరి 18 : విద్యుత్‌షాక్‌కు గురై ఒక గీతకార్మికుడు తీవ్ర గాయాల పాలైన ఘటన ఆదివారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వరంగల్‌కు చెందిన వీరయ్య బతుకుదెరువు కోసం కీసర మండలం యాద్గార్‌పల్లికి వచ్చాడు. స్థానిక కల్లు వ్యాపారస్తుల వద్ద గీత కార్మికునిగా చేరాడు. కాగా సాయంత్రం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. చెట్టు పక్కనే 11కేవీ విద్యుత్తు వైర్లు ఉండగా వీరయ్య చెట్టు ఎక్కగానే గాలి వీయటంతో తాటి కమ్మలు విద్యుత్తు వైర్లకు ఆనుకున్నాయి. దీంతో చెట్టుపైన ఉన్న వీరయ్యకు విద్యుత్ షాక్ తగిలింది. పట్టు కోల్పోయిన అతను వెల్లకిలపడి, మోకుపై వేళాడుతూ కేకలువేసాడు. ఇది గమనించిన స్థానికులు అతన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో చాకచక్యంగా చెట్టుపై నుంచి కిందికి దింపారు. చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అతని కాలుకు, చేతికి గాయాలయ్యాయని వైద్యులు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరి దుర్మరణం

కందుకూరు, ఫిబ్రవరి 18 : ఎదురెదురుగా వెళుతున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం కందుకూరు పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, కందుకూరు పోలీసులకు ఇచ్చిన సమాచాం మేరకు వివరాలు ఇలావున్నాయి. మండల కేంద్రంలో ఉండే సుదర్శణాచారి(40) కార్పెంటర్‌గా పనిచేసేవాడు. ఆదివారం సాయంత్రం మండంలోని మీర్ఖాన్‌పేట గ్రామం నుంచి మండల కేంద్రానికి బైక్‌పై వస్తున్నాడు. యాచారం మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన చిలుకల రమేష్(35) ద్విచక్రవాహనంపై కందుకూరు మండల కేంద్రం నుంచి తన సొంత గ్రామానికి వెళుతుండగా మండలంలోని అన్నోజిగూడ గ్రామ గేటు సమీపంలో వారి బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీనడంతో ఇద్దరికి బలంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా ఇద్దరు మార్గ మధ్యలో మృతి చెందారు. కందుకూరు సీఐ మక్బుల్‌జానీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సతీషన్ నాయర్ అంత్యక్రియలు

- పాల్గొన్న ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, డాక్టర్ వంశీ
- భారీగా తరలివచ్చిన అయ్యప్ప భక్తులు



సతీషన్‌నాయర్ పాడె మోస్తున్న వీర్లపల్లి శంకర్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 : ప్రముఖ అధ్యాత్మిక గురువు, అయ్యప్ప స్వామి పరమ భక్తుడు, గురుస్వామి శ్రీశ్రీశ్రీ సతీషన్‌నాయర్(75) అంత్యక్రియలు ఆదివారం మండల పరిధిలోని పాల్మాకులలో ముగిశాయి. ఆయన అంత్యక్రియలకు ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, డాక్టర్ వంశీ, సీడబ్ల్యూసీ ఆహ్వానిత సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మారెడ్డితో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి అయ్యప్ప భక్తులు వేలాదిగా తరలివచ్చి అంతియ యాత్రలో పాల్గొన్నారు. సతీషన్‌నాయర్‌ను కడసారి చూసేందుకు క్యూ కట్టారు. కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. నలభై ఏళ్లుగా షాద్‌నగర్, శంషాబాద్, కేశంపేట్, జడ్చర్ల, బాలనగర్, ఆమన్‌గల్లు, కొందుర్గుతో పాటు రంగారెడ్డి జిల్లాలోని అనేక మండలాల్లో ఆయన అయ్యప్ప మాలధారణ చేయించే వారు. కొన్ని రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.

పాడె మోసిన ఎమ్మెల్యే వీర్లపల్లి

సతీషన్‌నాయర్ అంత్యక్రియల్లో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయన పాడె మోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుస్వామి గురించి తెలిసిన ప్రతీ ఒక్కరికి ఇది విషాదకరమని చెప్పారు. ఎంతో మంది యువతను ఆయన అధ్యాత్మిక మార్గంలో నడిపించారని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పాల్మాకుల పీఏసీఎస్ ఛైర్మన్ శ్రవణ్‌కుమార్‌గౌడ్, స్థానిక సర్పంచ్ పంతంగి సుష్మారాజ్‌భూపాల్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లయ్య, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. మధ్యలోనే నిలిపేశారు



రోడ్డుపై లేస్తున్న దుమ్ము

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి బాకారం జాగీర్‌కు వెళ్లే రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంధులు పడుతున్నారు. అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ, నాగిరెడ్డిగూడ గ్రామం వరకు సీఆర్ఆర్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్డు) నిధులతో డబుల్ లైను రోడ్డు నిర్మాణం కోసం గతంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఆ పనులు 70 శాతం పూర్తి అయ్యాయి, కానీ మిగతా పనులను అధికారులు విస్మరించారు. పాతచౌరస్తా నుంచి అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీకి వచ్చే మార్గంలో శ్రీనిధి ఇంటర్‌నేషనల్ పాఠశాల ముందు నుంచి 800 మీటర్ల మేర నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఆ మార్గంలో ప్రయాణించాలంటే జంకుతున్నారు. దుమ్ము దూళి, గుంతలతో నరకయాతన అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి మిగిలిన పనులను పూర్తి చేయాలని అజీజ్‌నగర్ గ్రామస్థులు కోరుతున్నారు.

కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం నరకం

- ప్రయాణికుల ఇబ్బందులు
- నిధులు మంజూరైనా మధ్యలో నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు



లాల్‌పహడ్ నుంచి వికారాబాద్‌కు వెళ్లే రహదారి

చౌదరిగూడ, ఫిబ్రవరి 18 : మండలంలోని పలు రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారడంతో తమ ప్రయాణం నరకంగా మారిందని మండల ప్రజలు వాపోతున్నారు. పాడైన రోడ్లకు సంబంధిత అధికారులు మరమ్మత్తులు చేయించడం లేదు. నిత్యం రద్దీగా ఉండే సింగిల్ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. లాల్‌పహడ్ నుంచి తుమ్మలపల్లి, వనంపల్లి, వికారాబాద్ జిల్లా కంకల్‌కు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాగా ఉన్నప్పుడు వేసిన బీటీ రోడ్డు నేటికి మరమ్మత్తులకు నోచుకోవడం లేదని ఆయా గ్రామా ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై గోతులుగా మారి ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఈ రోడ్డు ఎన్నో ఏళ్ల గా మరమతులు కూడా చేయడం లేదు. ఈరోడ్డు వైపు ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం కన్నెత్తి చూడడం లేదు. ఈ రోడ్డు 3కిలో మీటర్లు ఉమ్మడి వికారాబాద్ జిల్లాలో ఉన్నందున పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు గోడు వెల్లబోస్తున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేనా...

గత ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల కోసం లాల్‌పహడ్ నుంచి చలివేంద్రంపల్లి, వీరన్నపేట్, పెద్ద ఎల్కిచర్ల, గాలిగూడ వరకు రోడ్డు విస్తరణ పనులకోసం దాదాపుగా రూ.6.5కోట్ల నిధులు మంజూరు చేసింది. కానీ ఆ పనులు లాల్‌పహడ్ నుంచి చౌదరిగూడ, జిల్లేడ్ వరకే పూర్తయ్యాయి. పెద్ద ఎల్కిచర్ల నుంచి గాలిగూడ వరకు పూర్తి చేశారు. మిగితా పనులు చెన్నారెడ్డిగూడ నుంచి చలివేంద్రంపల్లి వరకు, చేగిరెడ్డి ఘణాపూర్ నుంచి పెద్ద ఎల్కిచర్ల వరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం ఈ రోడ్డు పనులపై ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఏళ్ల తరబడి తప్పని తిప్పలు



లాల్‌పహడ్ నుంచి కంకల్‌కు వెళ్లే బీటీ రోడ్డు అక్కడక్కడ బీటీ తొలగిపోవడంతో వాహనాలను నడపాలేకపోతున్నాం. రాత్రి సమయాల్లో ఈ సింగిల్ రోడ్డుపై చాలా మందికి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ చేసి డబుల్ రోడ్డు వేయాలి.

-లింగంగారి మల్లారెడ్డి, వనంపల్లి, జిల్లేడ్-చౌదరిగూడ

ఎవరూ పట్టించుకోవడం లేదు



బీటీ రోడ్డు మరమత్తుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. అసలే సింగిల్ రోడ్డు వర్షాలకు అది కూడా పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు మరమత్తు పనులపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రాత్రి పూట వెళ్తే ప్రమాదాలు తథ్యం.

-కుమ్మరి హరీష్, వీరన్నపేట్, జిల్లేడ్ చౌదరిగూడ

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు

- బలవుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



ఫెనిసంగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్

బషీరాబాద్, ఫిబ్రవరి 18 : మండలంలోని పలు గ్రామాల్లో, చేన్ల వద్ద చాలా చోట్ల ఒరిగిన స్తంబాలు, కంచెలేని ట్రాన్స్‌పార్మర్లు, వేలాడుతున్న తీగాలతో ప్రజలు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, రైతులు భయందోళనల చెందుతున్నారు. మండలంలో విద్యుత్ సమస్యలపై మొర పెట్టుకుంటున్నా పట్టించుకునేనాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లో ఓల్టేజీ సమస్యను నివారించడానికి ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేస్తున్న ఆ శాఖ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. మండల పరిధిలోని ఎక్మాయి, క్యాద్గీరా, మైల్వార్, నవాల్గ, బషీరాబాద్ గ్రామాలు, తండాల్లో విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నాయి. ఇళ్ల సమీపంలో కూడా స్తంబాలకు విద్యుత్ తీగలు వేలాడతున్నాయి. పలు చోట్ల ట్రాన్స్‌పార్మర్లకు కంచె లేక మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వేలాడుతున్న తీగాలు సరి చేయాలని విద్యుత్ ఏఈ, సిబ్బంది చుట్టూ తిరగుతున్నా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో కరెంట్ సమస్యలపై ఏఈపై సభ్యులు పలువురు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆ తర్వాత అంతా షరామామూలేనని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



గ్రామంలో విద్యుత్ తీగలు పలుచోట్ల వేలాడుతున్నాయి. చేతి కందేంత ఎత్తులోనే అవి ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని భయంభయంగా గడుతున్నాంజ ట్రాన్స్‌పార్మర్లకు రక్షణ కంచె లేక మూగజీవాలు చనిపోతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడంలేదు.

- సాయిరెడ్డి, రైతు, ఎక్మాయి

డబుల్ కన్ఫ్యూజన్

- బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్‌లు
- కొత్త ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు ఎప్పుడో



పరిగిలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

పరిగి, ఫిబ్రవరి 18: కొత్త ప్రభుత్వంలో పేదల్లో 'డబుల్' కన్ఫ్యూజన్ నెలకొంది. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌లను నిర్మించినా అవి పూర్తికాక లబ్ధిదారులకు కేటాయించలేదు. ఏడేళ్లుగా వాటి నిర్మాణం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా పేలు తమ సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకుంటే దాని కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వడం, దాన్ని అమలు చేస్తామని చెబుతుండడంతో ప్రజలు ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500ఇళ్లు మొదటి విడతలో కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వం ప్రారంభించిన నియోజకవర్గానికి 680 డబుల్ బెడ్‌రూమ్‌లను మంజూరు కాగా 2015 అక్టోబర్ 22న శంకుస్థాపన చేశారు. కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా, మరిన్ని వివిధ స్థాయిల్లో ఉన్నాయి. ఇప్పుడు పూర్తయిన ఇళ్లకు లబ్దిదారులను ఎంపిక చేస్తారా? మల్లా దరఖాస్తులు తీసుకుంటారా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని స్వాగతిస్తున్నాం. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయించాలని ఇళ్లు లేని పేదలు కోరుతున్నారు.

పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తాం

ప్రభుత్వంలో పేదలందిరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం. నియోజకవర్గానికి మొదటి విడత 3,500 ఇళ్లు మంజూరయ్యాయి. గతంలో తీసేసిన హౌజింగ్ శాఖను తిరిగి ఏర్పాటు చేసి, ఆ శాఖ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబల్ బెడ్‌రూమ్‌లను కూడా త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకుంటా. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మాత్రం పేదవారికి సొంతంటి కల నేరవేస్తాం.

- టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పరిగి



బతుకు బండి జర పైలమండి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 18 : ఒక బైక్‌పై ఇద్దరు లేదా ముగ్గురు ప్రయాణించడం సాధారణంగా చూస్తుంటాం..కానీ కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం ఓ వలస జీవి తన బైక్‌పై మూటముల్లె, కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాదకరంగా ప్రయాణించడం ఆంధ్రజ్యోతి కంట పడింది.


కేఎల్లార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏసీపీ

'ఫ్రెండ్లీ పోలీసింగ్'ను మెరుగుపర్చాలి

మహేశ్వరం, ఫిబ్రవరి 18 : ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) కోరారు. మహేశ్వరం జోన్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఉమా మహేశ్వరరావు ఆదివారం లక్ష్మారెడ్డిని కలిశారు. తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను మెరుగుపర్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏసీపీ ఉమామహేశ్వరరావును కోరారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 18 : నిరుపేదల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని దెబ్బడగూడ గ్రామానికి చెందిన పి.కీర్తన ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దాంతో ఆమెకు మెరుగైన వైద్యసేవలందించడానికి ఆదివారం రూ.లక్షా50వేల ఎల్వోసీ మంజూరుకాగా కీర్తన తండ్రి రమేష్‌కు మీర్‌పేటలో అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు సేవలందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని, అన్ని రంగాల్లో అభివృద్ధిని సాదించడానికి మాజీ సీఎం కేసీఆర్ ఎంతో చొరవ చూపారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రమేష్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు కొలన్ విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి

● టీపీయూఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు సురధీర్



చేవెళ్ల, ఫిబ్రవరి 18 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని టీపీయూఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు గణపురం సురధీర్ ఓ ప్రకటనలో కోరారు. ఆదివారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటయిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని పేర్కొన్నారు. జీవో 317 ద్వారా స్థానికతను తుంగలో తొక్కి వేరే జిల్లాలకు బదిలీ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులను తిరిగి స్థానికత ఆధారంగా ప్రత్యామ్నాయ అవకాశం కల్పించాలని, రంగారెడ్డి జిల్లాకు చెందిన వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57 ద్వారా 2003 డీఎస్సీ టీచర్లకు నోటిఫికేషన్ ఆధారంగా పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా సీపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ హెల్త్‌కార్డుల ద్వారా చికిత్స అందించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హెల్త్‌కార్డులు ఏ ఆసుపత్రిల్లో కూడా అంగీకరించడం లేదన్నారు. కొత్త ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీని సత్వరమే ప్రకటించాలని పేర్కొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం

ఆమనగల్లు, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని మేడిగడ్డ తండాకు చెందిన వడ్త్యావత్ కిషన్ కూతురు వివాహానికి అదే తండాకు చెందిన రాత్లావత్ రమేశ్ చేయూతనందించారు. ఈమేరకు ఆదివారం రూ.10 వేలు కిషన్‌కు అందజేశారు. తండాలో పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు చేయూతనందిస్తున్న రమేశ్‌ను ఈ సందర్భంగా స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయరామ్, నందు, వినోద్, కిషన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు భక్తిభావం పెంపొందించుకోవాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


చౌదరిగూడ : శివరామాంజనేయస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి, తదితరులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 18: ప్రతీ ఒక్కరు భక్తి భావం పెంపొందించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముష్టిపల్లిలో శివరామాంజనేయ స్వామి, నాభిశిలా, ధ్వజస్తంభ, నవగ్రహ, గణపతి పూజ, కుమారస్వామి, నందీశ్వర, శ్రీకృష్ణ, పో చమ్మ తల్లి దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శివరామాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతోపాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. మండలాధ్యక్షుడు రాజు, కృష్ణారెడ్డి, బీసీసెల్ తాలుకాధ్యక్షులు చంద్రశేఖర్ ఎంపీటీసీలు సత్యనారాయణ రెడ్డి, రజిత, నర్సింలు, కృష్ణ, రాజు, అన్వర్, పాపయ్య, రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

కేశంపేట : వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కేశంపేట మండలం పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి గ్రామ శివారులో వెలసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ సభ్యుల కు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండలాధ్యక్షుడు గూడ వీరేష్ నాయకులు పల్లె ఆనంద్ కుమార్, అనుమగళ్ల రమేష్, కృష్ణయ్య, శేఖర్ రెడ్డి, మల్లేష్‌గౌడ్, మహేష్, శ్రీను, లింగం, దర్శన్, ముత్యాలు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు వేడుకలలో భాగంగా చక్రతీర్థం, ప్రదోష పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టిగోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, ట్రస్టీ కోట్ల జగన్మోహన్, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, అర్చకులు నవీన్ శర్మ, గూడ కృష్ణమాచార్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా పూర్ణాహుతి

కడ్తాల్, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని మక్తమాదారం గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. ఆదివారం ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి , ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్ గౌడ్ లు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో నిర్వాహకులు సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు ఆదిత్య, రంగాచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడికోట మైసమ్మ బోనాలు


మహేశ్వరం : గడికోట మైసమ్మ ఆలయానికి బోనాలతో తరలిన భక్తులు

మహేశ్వరం : మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రతీయేటా అత్యంత వైభవంగా నిర్వహించే మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ అల్లెకుమార్ అన్నారు. మార్చి 8న మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం మహేశ్వరం శివగంగరాజరాజేశ్వరాలయం పక్కనే గల గడికోటలో మైసమ్మకు ఆనవాయితీ ప్రకారం బోనం సమర్పించారు. ఈమేరకు అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలను రాజకీయాలకతీతంగా ప్రతీఒక్కరు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉత్సవంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు నిమ్మగూడెం సుదీర్‌గౌడ్, కూన యాదయ్య, నాగేశ్వర్, ఎం.నవీన్, ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, గడగూటి జంగయ్య, నాయకులు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం


కొండల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న అమ్డాపూర్ మాజీ సర్పంచ్ రవళి, తదితరులు

మొయినాబాద్/మొయినాబాద్ రూలర్, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు తగిన న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, కాంగ్రెస్ నాయకుడు, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డాపూర్ మాజీ సర్పంచ్ బుర్గు రవళి, ఆమె భర్త గోపికృష్ణారెడ్డి, కేతిరెడ్డిపల్లికి చెందిన సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పరందామగౌడ్‌తోపాటు నాయకుడు దయానంద్‌గౌడ్ పలువురు నాయకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి సమక్షంలో నగరంలోని ఆయన నివాసంలో పార్టీలో చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తుందని చెప్పారు. జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీంభరత్, సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మండలాధ్యక్షుడు మాణెయ్య, ఉపాధ్యక్షుడు మర్రి రవిందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, సీనియర్ నాయకులు బాలకృష్ణారెడ్డి, మహేందర్‌ముదిరాజ్, భద్రప్ప, రవీందర్, బాలకృష్ణ, శ్రీరామ్, భిక్షపతి, మహేందర్‌రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'మహతి మౌక్తికములు' పుస్తకావిష్కరణ


పుస్తక సంపుటిని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, సిధారెడ్డి, తదితరులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 18 : పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు, కవయిత్రి దాస ఈశ్వరమ్మ రచియించిన మహతి మౌక్తికములు అనే కావ్య సంపుటిని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవి సంగమం ఆధ్వర్యంలో మాతృబాషా దినోత్సవం, కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లుకు చెందిన కవయిత్రి దాస ఈశ్వరమ్మ రచించిన కావ్య సంపుటి మహతి మౌక్తికములను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డితో కలసి డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. మహతి సాహితీ కవి సంఘం అధ్యక్షుడు డా.అడిగొప్పుల సదయ్య పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

అమ్మతో నేను పుస్తకావిష్కరణ

కల్వకుర్తి నియోజకవర్గంలోని జాజాలకు చెందిన లయన్స్‌క్లబ్ ఎవరెస్ట్ సభ్యుడు ఇమ్మడి బుచ్చయ్య రచించిన అమ్మతో నేను పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత తెలుగు శాఖాధిపతి మసన చెన్నప్ప, విశ్రాంత ప్రిన్సిపాల్ తూడి హన్మంతరెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లిక్కి అనురుద్రారెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జూలూరి రఘులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మతో నేను పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాగా, తన తల్లి లింగమ్మ జీవిత చరిత్ర గురించి అద్భుతంగా పుస్తకాన్ని రచించిన బుచ్చయ్యను వక్తలు ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కల్వకుర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, వందేమాతరం జిల్లా అధ్యక్షుడు భట్టు నర్సిరెడ్డి, జీహెచ్‌ఎం శంకర్, సదా వెంకట్ రెడ్డి, చిత్తరంజన్ దాస్, మధు, భాస్కర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

ఆమనగల్లు, ఫిబ్రవరి 18: మహనీయుల జీవితాలు ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అంబేద్కర్, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు, చైతన్యం సాధ్యమని వారు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం జ్ఞాన చైతన్య ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చూపిన మార్గంలో ప్రతీఒక్కరు ముందుకు సాగాలని సూచించారు. ధన్నారం బాలు, జంతుక శంకర్, మల్లేశ్, విక్రమ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆమనగల్లు, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మండలంలోని మేడిగడ్డ తండాకు చెందిన వడ్త్యావత్ కృష్ణ(41) ఆదివారం మృతిచెందాడు. ఈనెల 16న సాయంత్రం కూరగాయలు తేవడానికి బైక్‌పై కృష్ణ ఆమనగల్లుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కల్వకుర్తి రోడ్డులో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం కృష్ణ మృతిచెందాడు. అతడి భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రాంనాయక్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


రవి

తలకొండపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని పడకల్‌కు చెందిన చెవిడి రవి అదృశ్యమైనట్లు అతడి సోదరుడు కుమార్(అన్న) ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక పెట్రోల్ బంక్‌లో పనిచేసే రవి తన తల్లితో కలిసి పడకల్‌లో ఉంటున్నాడు. కాగా, ఈనెల 14న రవికి పెళ్లి సంబంధం మాట్లాడటానికి కుమార్ ఇంటికి వెళ్లాడు. అయితే, తాను బయటికి వెళ్లి వస్తానని చెప్పిన రవి.. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. దాంతో తెలిసినవారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి..


విజయలక్ష్మి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 : యువతి అదృశ్యమైన సంఘటన ఆదివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎర్రుల విజయలక్ష్మి ఈ నెల 15వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు చేశారు. అయితే, ఇంటి నుంచి వెళ్లిన విజయలక్ష్మి.. ఇంట్లో ఉన్న ఆరతులం బంగారం, 30 తులాల వెండి, రూ.6వేల నగదు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శం


బాలగ్రామ్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

యాచారం, ఫిబ్రవరి 18 : పొరుగు వారిని ప్రేమించు.. శత్రువుకు సైతం ప్రేమను పంచు అనే గొప్ప సందేశాన్ని ఇచ్చిన క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమని, నేటి తరం ఏసు నుంచి ఎంతో నేర్చుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సెయింట్ గ్రిగోరియస్ బాలగ్రామ్ సంస్థ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడారు. సమాజంలో అట్టడుగున ఉన్నవారికి విద్య, వైద్యం తదితర సేవలు అందిస్తున్న బాలగ్రామ్ సంస్థ సేవలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. ఏసుక్రీస్తు చూపిన అడుగు జాడల్లో తమ వంతుగా సేవలందిస్తూ సమాజాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులను మల్‌రెడ్డి అభినందించారు. సంస్థకు ఎల్లవేళలా తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. సంస్థ ప్రతినిధులు కేవి ఫిలిప్స్, యాచారం మండల వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నల్లవెళ్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం


ఆగిర్యాలలో ప్రచారం చేస్తున్న సభ్యులు, తదితరులు

కొందుర్గు, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని ఆగిర్యాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక మహబూబ్‌నగర్ కమిటీ కార్యవర్గసభ్యులు నాగ్యానాయక్ మాట్లాడుతూ పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి అవసరంలేని ఈశ్వర లింగాలను చూపించారని, సాకార భగవంతుడికి గర్భగుడి ఉంటుందని, సప్తనాడీ కేంద్రాలుగా దేవాలయాల్లోని గోపురాలు ఉంటాయని వివరించారు. దేవాలయాలు సగుణోపాసన, నిర్గుణోపాసన వ్యత్యాసాలను తెలియజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బుచ్చిలింగం, రజిత, అమ్ములు, వెంకటేష్, కిషోర్, కృష్ణయ్య, విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు, సీపీఐ నాయకుడు రామస్వామి

చేవెళ్ల, ఫిబ్రవరి 18 : ప్రతీఒక్కరు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ కాలనీలో నగరంలోని సోమాజిగూడలో ఉన్న సీఎస్‌సీ హెల్త్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి పాల్గొన్నారు. వైద్యులు ఉచితంగా ప్రజలందరికీ వివిధ రకాల పరీక్షలు చేశారు. వైద్యులు మహమ్మద్ మస్తాన్, సాయితేజ, రాజశ్రీ, అబూ, సోఫియాన్, సందీప్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకుడు సత్యనారాయణ, సుగుణమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం

కడ్తాల్, ఫిబ్రవరి 18 : ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితం పొందుతారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు జరిగే శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ తిరునగరి వేణుగోపాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు హైదరాబాద్‌లోని జైపాల్‌యాదవ్ నివాసంలో ఆయనకు అందజేశారు. బ్రహ్మోత్సవాలు, స్వామి వారి కల్యాణంలో పాల్గొనాలని జైపాల్‌ను కోరారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని మాజీ ఎమ్మెల్యే నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. నాయకులు రాంచంద్రయ్య, అశోక్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.


జైపాల్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న వేణుగోపాల్, జీఎల్ఎన్ రెడ్డి

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు, ఫిబ్రవరి 18: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆమనగల్లు పట్టణంలోని వివేకా విద్యాభారతి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈమేరకు పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి మూడు, నాలుగవ స్థానాల్లో నిలిచి బహుమతులు గెలుపొందారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో ఈనెల 15 నుంచి 17 వరకు మూడవ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివేకా విద్యాభారతి పాఠశాల నుంచి రెండు టీంలు పాల్గొన్నాయి. బాలికల విభాగం 3వ, బాలుర విభాగంలో నాలుగవ స్థానంలో నిలిచి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మహమూద్ తెలిపారు. ఈమేరకు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ఆదివారం పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు ఘనంగా అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు పాషా

ఆమనగల్లు, ఫిబ్రవరి 18: వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్, తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండ అధికారులు, ప్రజాప్రనిధులు చొరవ తీసుకోవాలని, సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. మిషన్ భగీరథ అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేసి అన్ని ప్రాంతాలు పూర్తి స్థాయిలో తాగునీటి నందించాలని ఆయన అధికారులకు సూచించారు. ఆమనగల్లు మండలంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఈజీఎస్ నిధుల నుంచి చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణం పనులపై ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సరఫరాపై చర్చించారు. ఆమనగల్లు మున్సిపల్ విద్యానగర్ కాలనీలో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, దాంతో బోరు మోటర్లు, గృహోపకరణాలు తరుచూ కాలిపోతున్నాయని కాలనీ అధ్యక్షుడు ఎంఏ పాష ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులతో కలిసి కసిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యానగర్ కాలనీలో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉన్నందున మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించాలని, కాలనీలో అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, ఓహెచ్‌ఎస్ఆర్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం గురించి ఎమ్మెల్యేకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. కాలనీలో త్వరలో అన్ని అంతర్గత రోడ్లను సీసీగా మారుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వేసవి నేపథ్యంలో ఎక్కడ నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని నారాయణ రెడ్డి కోరారు. ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి కల్వకుర్తి నియోజకవర్గానికి రూ.15 కోట్లు మంజూరైనట్లు ఆయన వివరించారు. సమావేశంలో వర్కాల శేఖర్, ఎం. జంగయ్య, సుదర్శన్ రెడ్డి, మ్యాక వెంకటేశ్వర్ రెడ్డి, పత్యనాయక్, పర్వతాలు, దోనాదుల సత్యం, తదితరులు పాల్గొన్నారు.